కథానిక

# ప్రియ స్నేహితులు

మొవ్వ రాంబాబు

చలి తీవ్రంగా ఉన్నది. సూర్యోదయ మవటానికి ఇంకో ఝామురాత్రి గడవవలసి వుంది. మునగతీసుకొని ముసుగులో పండుకొన్న ఓబులాడు దిగ్గున నిద్రనుండి లేచాడు. పళ్లు కొంగర్లుపోతూన్న ఆ చలిగాలిలోనే చలిని తిట్టుకుంటూ బయటికి రావటానికి తడికకట్టువిప్పాడు. ఆ మసకచీకట్లోనే నలువైపులా పరిశీలించాడు. ఆదగ్గర్లో ఏమీ కనుపించలేదు. కొద్దిదూరం వెళ్లి ఇంకొక పాకలోకి ప్రవేశించి "వీరాసామీ" అని కేక వేయంగానే వీరాసామి మంచంమీదనుంచి దిగ్గున లేచాడు.

"ఇవ్వాళ ఇంత పెందలకడనే లేపావేమిరా?" అడిగాడు వీరాసామి బయటకు వచ్చి ఆకాశంవంక చూస్తూ.

"పెందలకడా లేదు. ఏమీ లేదు" అన్నాడు ఓబులాడు.

"ఇంత పెందలాడే పోయి చేసేదేముంది. కొద్దిగా చలికాగి వెళ్లుదాం. ఇక్కడే ఉండు. అట్ల బాపనయ్యగారి వాముకల్లె వెళ్ళి ఒక మోపెడు వేరుశనగ తుక్కు కట్టుకు తెస్తా. మరిచిపోయా. బుడ్డి ఆరిపోయింది. నిప్పులపుల్ల ఉంటే సంపాదించు" అంటూ వీరాసామి ఆ చీకటిలో చరచరా నడిచి వెళ్ళిపోయాడు.

ఓబులాడు వీరాసామి వచ్చేటప్పటికి నిప్పులపెట్టె తన చీకటిగుడిసెలో వెతికి సాధించకలిగాడు.

"ఓరి నీదుంపతెగ ఏమి కరువుకాలంరా అంత కట్టుకువచ్చావు? తెలిస్తే రేపు ఆ దరికల్లె పోగలమా!" అన్నాడు.

వీరాసామి తల, పైపంచ దులుపుకునే లోపునే ఓబులాడు మంట తయారు చేశాడు. ఇద్దరూ మంటచుట్టూ చేరారు. నిశీథమయిన రాత్రిసమయాన వారి మొఖాలు గానీ, వారి ఆకృతులు గానీ ఉన్నవి ఉన్నట్లుగా చూడటానికి ఆమంట చాలకపోయినా ఆమంటకాంతిలో వారిని మనము పోల్చుకో వచ్చును.

మిత్రులు ఇరువురూ సమాన వయస్కులుగా మనకు కనుపించినా కొద్ది తారతమ్యం ఉన్నది. కథావస్తువుకి సంబంధించినంత వరకూ వారి వయస్సుతో పనిలేదు. ఎందువల్లనంటే వారు చేసిన పాపంగాని పుణ్యంగాని వారి వయస్సులతో లంకె పెట్టటం, "వయస్సుతో పాటు మార్పు" అని త్రోసిపుచ్చటం గాని వారికి ఇష్టం లేదు. చిన్న వయస్సులోనే ఈ నాటి యువకరచయితలవలె లేనిపోని వేదాంతాన్ని గురించి, పరబ్రహ్మజిజ్ఞాసను గురించి గాని, లేక మాట్లాడటానికి నోరు తిరుగనటువంటి గత తార్కిక భౌతిక వాదాలని గురించి గాని ఆలోచించటం, వాదించటం, అవకాశం కలిగితే వ్రాయటం వాళ్ళకు మించిన విషయం.

ఇదంతా ఎందుకంటే వారిద్దరి వయస్సులో కొద్దితేడా మాత్రమే ఉన్నది. ఓబులాడు మనిషి కొంచెం కురచగా, బొద్దుగా కనుపిస్తాడు. బోల్లిమీసం. మనిషి చామనఛాయ. చిన్న గుంటకళ్ళు. తీక్షణమయిన ఆ కళ్లని చూస్తే ఆదాటున మనకి కొద్దిగా భయం కలుగుతుంది. కాని వాడి గొంతుగాని, స్వరంగాని, సంభాషణగాని అతినిదానము. ఊర్లోవాళ్ళందరూ వాడంటే ఇష్టపడతారు. తనకికాని వ్యవహారాల్లో వేలు ఇరికించడు. తనవాటిల్లో ఇతర్ల జోక్యాన్ని సహించాడు. ఇంక వీరాసామి వాడికి అన్నివిధాలా వ్యతిరేకి. పచ్చిదొంగ. తనకి ఏది కావాలనుకున్నా, మరుసటి రోజుకల్లా ఇంట్లోకి చేరవేసుకుంటాడు. ఆ రాత్రిపూట వాడికి ఫలానా వస్తువు కావాలని అనుకోవటం ఆలస్యం. అప్పటికప్పుడే బయలుదేరుతాడు తెచ్చుకోవటానికి. ఓబులాడిసావాసం చేయటం మొదలు పెట్టినతర్వాత వాడిదొంగతనాలు చాలావరకు తగ్గాయని అభిజ్ఞవర్గాల ద్వారా తెలుస్తుంది. వీడితో చేరిన తర్వాత ఓబు

లాడుకూడా దొంగతనాలు చెయ్యటం మొదలు పెట్టాడనికూడా అనుకుంటున్నారు.

వీరాసామి కొంచెము పొడుగు. ఎరుపురంగు. స్ఫుటమయిన ముక్కు, విశాలమయిన కళ్ళు, కొద్దిపాటి మీసాలు. అన్నింటికన్నా ముఖ్య మయిన విషయం వాడి పొడుగాటి జుట్టు. చాలా ఆకర్షణీయంగా కనుబడతాడు ఎప్పుడూ తెల్లటి దుస్తుల్లో. కాని వాడిని పెద్దమనుష్యు లెవ్వరూ దగ్గరికి చేరనివ్వరు. వాడు అప్పుపుచ్చు కున్నా ఇవ్వాలనేబుద్ధి వాడికి కలుగదు. సరి కదా అదేమి విచిత్రమో వాడికి అప్పు ఇచ్చిన వాడు వీడిని చూచి తప్పుకుపోతాడంటే నమ్మ వలసిందే.

"ఎవడురా నాకు అప్పు ఇచ్చింది? నాదగ్గ రకువచ్చి అడగమనూ, ఎంత ఇవ్వాలో..." ఇదీ ధోరణి. వాడు ఈవిధంగా అనాలోచితంగా అప్పుఇచ్చినవాళ్ళనూ ఇవ్వనివాళ్ళనూ అందరినీ కలిపి దండకం చదవ మొదలుపెట్టేడంటే పెద్ద మనిషి అయినవాడెవడూ వాడిని వారించలేడు. ఓబులోడు మాత్రం వాడిని సమాధానపరచ గలడు. కాబట్టి వాడితో శాంతియుత పరిష్కా రం కావాలంటే ఓబులోడిని పట్టుకోవలె.

మంట కొద్దికొద్దిగా ఆరిపోతూ మరల ఇంత కంపపడగానే వెలుగుతూ ఉన్నది. ఆరిపో బోయే సమయానికల్లా ఓబులోడు కొంచెం కంప దానిమీద వేసేవాడు. వీరాసామి పుగాకు చుట్టచుట్టుకొని ఒక పాయ ఓబులాడి కిచ్చి చుట్ట నోట్లోపెట్టాడు కాల్చుకోటానికి.

ఓబులాడు చుట్టచుట్టుకుంటూ అడిగాడు.

"ఒరేయ్! మన మంగాము చచ్చిపోయిం దంటే నమ్ముతావా?"

"నేనయితే నమ్మను గాని . మరయితే ఆ ఊరి మునసబు, అందరూ చచ్చిందనే చెప్పుతు న్నారుగందా. చావటంకూడా కాదు ఎవడో చంపాడని చెప్పుతుండిరి." అన్నాడు వీరా సామి.

"అదేరా నేను అడిగేది? దానంతట అదే చచ్చిందా, లేక మరిఎవరయినా చంపేశారా" అడిగాడు ఓబులాడు.

"ఎట్లాగోట్లా చచ్చింది. చచ్చింది ఎట్లా గూ తిరిగిరాదు. అది ఎట్లాచచ్చినా మనకు ఒకటే." అన్నాడు వీరాసామి.

"నిజమేననుకో. కాని అది ఎప్పుడూ తనంతట తానే చస్తాననేది. దాని మీద ఎవరినీ చెయ్యి చేసుకోనిచ్చేది కాదు. అప్పు డప్పుడు మనతో మాటమాట వచ్చి పోట్లాట వచ్చినప్పుడుకూడా ముందు మన్ని చంపి తరు వాత తాను చస్తాననేది" అన్నాడు ఓబులాడు. ఓబులాడి మనస్సులో ఏమేమి భావాలున్నవో వీరాసామికి తెలుసు. ఓబులాడు అట్లా ఊళ్ళో ప్రజలతో సంబంధాలు తెగగొట్టుకొని ఏకాం తంగా ఉండటం మంగాము వల్లనేనని కూడా వీరాసామికి తెలుసు. మంగామును తీసుకొచ్చిన ఓబులాడిని ఊళ్ళో పెద్దలు బహిష్కరించక పూర్వమే వాడు వాళ్ళందరినీ విడిచిపెట్టి ఊరి బయట దానితో కాపురం పెట్టాడు. దాని తర్వాత పూరు పెరగటంవల్ల వాడి ఇంటి వరకూ ఊళ్ళో వాళ్ళ ఇళ్ళు వచ్చినవి. ఓబు లాడినీ మంగామునూ ప్రజలు దంపతులుగానే చూడటం మొదలుపెట్టారు రోజులు గడచిన పిమ్మట. "నీకా రోజులు జ్ఞాపకం ఉన్నవా? మనముగ్గరం ఇట్లాగే చలిమంటదగ్గర కూర్చుని మాటలుచెప్పుకొన్నాం" అడిగాడు ఓబులాడు.

"జ్ఞాపకం లేకేం. ఎప్పటికీ మరిచిపోలేను."

"ఎంత మంచిది రా అది, ఇంతకీ దానికి ఏం బుద్ధో అట్లా వెళ్ళిపోయింది" అన్నాడు ఓబు లోడు.

వీరాసామి జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు. సుమారు పదేళ్ల క్రితం, వాడూ, మంగాము ఓబులోడు, చిలి మంట చుట్టూ చేరి అనేక మయిన విషయాలు మాట్లాడుకొనేవారు. ఆ యేడు వేసవిలో కొండల మీదికి పచ్చిగడ్డి మేపటానికి ఓబులోడు అనేక ఊళ్ళవాళ్ళ పశు వులని తోలుకు వెళ్ళటానికి నిశ్చయించుకొన్న విషయం వాళ్ళకు ఎరుక పరచాడు. ముగ్గురూ కలసివ్యాపారంలో ఎంతలాభించేదీ ఆ లాభాలు మళ్ళా ఎట్లా ఖర్చు పెట్టాలిసిందీ ఆలోచిం చారు. మంగాము తనకాళ్ళకి కడియాలు, అందెలు చేయించి పెట్టమంది. వీరసామి తనకి ఒక పాడి గేదని సంపాదించి పెట్టమన్నాడు. అప్పుడు వాళ్ళు ముగ్గురు అట్లాగే మంటచుట్టూ కూర్చుని వున్నారు. మంగాము మొఖం కళకళ

లాడుతూ, కాంతి వంతంగా ఉంటుంది. ఆ రాత్రి సమయాన ఆమె అవయవాల శోభ వర్ణనాతీతం. ఆమెలోని ఏదో ఒక ఆకర్షణశక్తి అందరినీ ముగ్ధులను చేసేది.

వీరాసామి ఇట్లా ఆలోచిస్తుండగానే మళ్లా సాగించాడు ఓబులోడు. "అది భూలోకంలో పుట్టాలిసింది కాదురా. దాని మాటలకి మనుష్యులెవ్వరూ సమాధాన మివ్వలేరంటే నమ్ము. అది ఉన్నన్నాళ్లు ఏం సుఖపడ్డానో ఏమో, అది నాదగ్గరనుంచి వెళ్ళిపోయింది, అది మొదలు నేను ఇంతే" నంటూ నేలవంక చూడటం మొదలుపెట్టాడు.

వీరాసామి మంగాముని గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. ఆ యేడు ఓబులోడు ఊళ్ళో వాళ్ళ పశువులని కొండమీదికి తోలుకు పోవటం, మంగాము ఒక్కతే ఇంటివద్ద మిగలటం సంభవించినవి. అతడు ఆమెనికూడా తీసుకు వెళ్ళాలని ప్రయత్నించాడుగాని ఊరు విడచి రానంది ఆమె. ఆ వేసవికాలమల్లా ఆమె వీరాసామిదగ్గర గడిపింది. ఓబులోడికి అనుమానంగానే ఉన్నది ఆమె తనతోపాటు కొండలమీదికి రానప్పుడు. కాని ఆమెని ఎవ్వరూ బలవంతపెట్టలేరు. అందువలన వాడు ఏమి చేయలేకపోయాడు. ఓబులోడులేనప్పుడు ఆమె వీరాసామి దగ్గరవుండేది. కాని మళ్ళా ఏమి గుబులు మళ్ళిందో ఏమో వీళ్ళిద్దరికీ అంతు తెలియకుండా ఒకరోజున సెలవు పుచ్చుకుంది. తర్వాత కొద్దిరోజులు స్నేహితులిద్దరూ అనేకమయిన ఊళ్లు గాలించారుగాని నిష్ప్రయోజనమయింది. ఇది జరిగిపోయి సుమారు ఎనిమిది సంవత్సరాలవుతుంది.

"అది ఎంత చెడ తిరిగేదయినా చాలా మంచిది. అది సంతోషంగా ఉండేది మనల్ని కూడాసంతోషపెట్టేది" అన్నాడు ఓబులోడు.

తెచ్చిన వేరుసెనగ తుక్కు అయిపోయింది. ఇంకా తెల్లవారలేదు. ఇద్దరూ లేచి తూర్పు దిక్కుగా చేలల్లోగుండా బయలుదేరారు. కంది పొలాల్లో గుండా కందిమండల్ని పడదొక్కుకుంటూ దారిచేసుకుంటూ పోతున్నారు. స్నేహితు లిద్దరూ నిశ్శబ్దంగా నడుస్తున్నారు. మాట్లాడుకోటానికి వాళ్ళకు ఏ విధమయిన విషయాలూ లేక కాదు. ఇద్దరికీ ప్రియమైన మంగాము ప్రసక్తి వచ్చేటప్పటికి ఉషఃకాలంలో నిర్మలంగా ఉన్నవారి ఇద్దరి మనస్సులూ పతిత అయిన ఆమెకొరకు ఆందోళన పడసాగినవి. కానిపాపం ఆమె వీళ్ళిద్దరికీ ఏమీ కాదు. దుర్మార్గుడెవడో ఆమెని ముక్కకి ముక్కగా తెగనరికాడు. కాని దూరదేశంలో పతిత అయిన ఆమె కొరకు ఇద్దరు సామాన్య మానవులు నిశ్శబ్దంగా నిర్మలంగా ఆమెకొరకు విచారించుతున్నారని వాడికి తెలిస్తే వాడు ఆమెను హత్యచేసి ఉండడేమో.

చేలుదాటి చిన కొరిగుంటలో ప్రవేశించారు. అదికూడా దాటి తాళ్ళతోపులో ప్రవేశించారు.

వీరాసామి గబగబా తాటిచెట్టు పైకి ప్రాకి కల్లు కుండని ఒలిచాడు. కల్లు కుండలో సగానికి పైగా ఉన్నది. ఇద్దరూ కూర్చున్నారు. ఆ కల్లు వాసన జ్ఞానేంద్రియాలకు తగిలిందో లేదో ఓబులాడు కవిత్వం మల్లె చెప్పుకుపోతున్నాడు. అతని తల చేతులు గాలిలో ఊగుతున్నవి. వీరాసామి తాటాకు ఒకటి నరికి తెచ్చి రెండు రేకులుగాకట్టాడు. కుండలోంచి అమృతాన్ని ఇద్దరూఒంచుకొని పట్టిస్తున్నారు. కుండ ఖాళీ కావస్తున్నది.

"అది దేవత రా. అదికూడా ఇప్పుడు ఇక్కడ ఉంటే ఎంత సరదాగా ఉండేది?" అన్నాడు ఓబులాడు.

"ఎట్లా ఉంటుంది? నీది అంతా విచిత్రం కాకపోతే?" అన్నాడు వీరాసామి.

"అయితే అది స్వర్గానికి పోతుందంటావా"

"ఏమో!"

అర్ధని మాలిత నేత్రాలతో సగం ఖాళీ అయిన ఆ కల్లు,కుండ ముందు మోకిరిల్లి ఓబులాడు "భగవంతుడా? ఈ ప్రపంచంలో నాకు కోరికలు లేవు. నేను నిన్ను కోరుకునేది ఏమిటంటే చచ్చిపోయిన నామంగాముని స్వర్గానికి తీసుకెళ్ళి సుఖంగా కాపాడు దయామయా" అని మళ్ళా ఆగి "నీవేమంటావు వీరాసామీ?" అని అడిగాడు.

"అది వచ్చేజన్మలో అయినా నీదగ్గర ఉండేటట్లు కోరుతాను" అన్నాడు వీరాసామి ఒక

కన్నీటి చుక్కని రాలుస్తూ.

“అవునురా. మంచి కోరిక కోరావు. నా స్నేహితుని కోరిక అయినా మన్నించు భగవాన్” అంటూ తూలుతూ ఆచెట్టు క్రిందనే స్నేహితు లిద్దరూ పడిపోయారు.

ప్రాతఃకాలం వెళ్ళిపోయి అరుణోదయమవబోతూంది. తాటితోపు అవతల ఇసక పర్రల మీదుగా అప్పుడే అరుణోదయ కాంతులు పడుతూన్నవి. తల్లి ఒడిలోని పిల్లల మల్లే అందరికీ తల్లి అయిన భూమాతను కౌగిలించుకొని ఆ స్నేహితులు ఆ ఇసుకలో వాళ్ళిద్దరకూ ప్రియమైన ఒక అదృశ్యమయిన వస్తువుని అస్ఫుటమయిన స్వరాలతో స్మరిస్తూ నిదురిస్తున్నారు.

# అధికోత్పత్తి చేస్తున్న ఒక్క పరిశ్రమ

తిత్తి జనార్దనరావు

క్రితం మూడు దశాబ్దాల నుండి మనదేశంలో జనాభాసంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా గత పది సంవత్సరాలుగా 4 కోట్ల 40 లక్షల జనాభా అధికంగా పెరిగిందని అధికారరీత్యా తెలుస్తూంది. జనాభా యిట్లా పెరిగిపోతోంటే ప్రభుత్వాలు పరిపాలన సాగించడం కష్టతరమంటారు పెద్దలు. ఏమంటే, కనీసం వాళ్ళందరికి తిండైనా పెట్టవలసివుంది వారి జీవితప్రమాదాన్ని గురించి ఆలోచించకపోయినప్పటికీ. 1951 సం॥లో తీసిన జనాభాలెక్కలు చూసి భారతదేశం గుండె బాదుకునే పరిస్థితి వరకూ వచ్చింది. సాంఘికవేత్తలకు కూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది మన దేశ సంతానోత్పత్తి.

జనాభా పెరుగుదల ప్రకృతావసరాలకు విరుద్ధంగా వున్నప్పుడు తప్పకుండా కొన్ని అవాంతరాలు వచ్చి ఆ పెరుగుదలను నాశనం చెయ్యగలవని, మాల్థూస్, ఆయన అనుచరులు చెప్పారు. కాని, ఆ నిర్వచనం మనదేశంలో నిజం కాలేదని ఋజువవుతున్నది. ఎన్ని అవాంతరాలు వచ్చినా, ఎన్ని క్లిష్టపరిస్థితులు ఎదుర్కొన్నా, ఎంతగా జననష్టం సంభవించినప్పటికీ, జనాభా పెరుగుదల మాత్రం గత ముప్ఫై యేండ్లనుండిఅంతకంతకు హెచ్చవుతూనేవుంది.

1943లో బెంగాలులో క్షామం వచ్చింది. ఆ సంవత్సరం 43 లక్షలు ప్రజలు చనిపోయినట్లు తెలుస్తుంది. ఆతర్వాత దేశవిభజన జరిగింది. మతావేశపరుల మూర్ఖత్వంవలన అనేకమంది అమాయకులు చనిపోయారు. అట్లా చనిపోయినవారి సంఖ్య 20 లక్షలని తెలుస్తూంది. ఆంధ్రదేశంలో తుఫాను, బెంగాలులో వరదలు, హైదరాబాదులో రజాకార్ హత్యలు—వీటివలన లెక్కకు అందనటువంటి అమాయకప్రజలెందరో నాశనమైపోయారు. మొన్నమొన్న అస్సాంలో పెద్దపెట్టున భూకంపం వచ్చింది. ఎన్నో లక్షల ప్రాణాలు అందులో ఆహుతి అయిపోయాయి. ఇంకా బలవన్మరణాలు, హత్యలు—ఇంకా తెలియరానటువంటి చావులు అధికసంఖ్యలోనే వున్నాయి.

అన్ని అవాంతరాలు వాటిల్లి,అన్ని చావులు కలిగినప్పటికీ మనదేశంలో జనాభా యీ పది సంవత్సరాల్లో అధికంగా పెరిగిపోయినట్లు క్రొత్తగా తీసిన లెక్కలవలన తేలింది. అంత జననష్టం కలిగినప్పటికీ మిగిలినవారికి తిన తిండి సరిగ్గా దొరకడం కష్టమయిపోతోంది. చాలా మంది ఇంకా కరువులో మాడిపోతున్నారు. మరికొంతమంది ఆకలి జబ్బుల్తో దీర్ఘరోగులై పోతున్నారు. అయినప్పటికీ అటువంటి పరిస్థితుల్లో కూడా జనాభా పెరిగి పోతోందనీ ఆ పెరుగుదల అధికంగానే వుందని అంచనా వెయ్యబడింది. ఇంతకంటె ఆశ్చర్యం ఇంకోటుందా!

మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని వల్లించేవారు, యీ జనాభా పెరుగుదలకు ధనవంతుల భోగవిలాసాలే కారణమని వాదిస్తారు. భోగవిలా